





నాలుగు గేట్ల ద్వారా దిగువకు వెళ్తున్న నీరు. కృష్ణమ్మకు పట్టువస్త్రాలు సమర్పిస్తున్న ముఖ్యమంత్రి చంద్రబాబు

ఊరికి దూరమైనా..

ఉపాధి కరువు..!



- రజక వృత్తిదారులకు రక్షణ ఏది..?
- కార్పొరేట్లకు వరాలు పేదలకు శాపాలు
- అమలుకు నోచని కూటమి ప్రభుత్వ హామీలు

రజక వృత్తిదారులకు గ్రామాల్లో ఉపాధి లేదు. రక్షణ లేదు... పట్టణాలకు వలస వస్తే వృత్తికి గ్యారంటీ లేదు... ఊరికి దూరమైనా ఉపాధి లేదు. పట్టణాల్లో పనికి తగిన వేతనం లేదు. పిల్లల చదువు, ఆరోగ్య సమస్యలు వెరసి అప్పులపాలై దుర్భర జీవనం గడుపుతున్నారు. పాలకుల హామీలు బుట్టదాఖలవుతున్నాయి. ఉమ్మడి జిల్లాలో దాదాపు 60 వేల జనాభా ఉన్న రజక వృత్తిదారులకు ఉపాధి, రక్షణ అవసరమని కోరుతున్నారు.

ప్రజాశక్తి-కర్నూలు కార్పొరేషన్

గతంలో రజకులు గాడిదలపై బట్టలు తీసుకెళ్లి.. నీరుండే ప్రదేశాలు కుంటలు, చెరువులు, నదుల్లో బట్టలు ఉతికేవారు. కాలం మారింది. పరిస్థితులకు అనుగుణంగా కొత్త ఆవిష్కరణలు వచ్చి వాషింగ్ మిషన్లు వచ్చాయి. రజక వృత్తిదారులకు పని లేకుండా పోతోంది. రజక వృత్తిదారులకు గ్రామాల్లో వ్యవసాయం, వృత్తి పనులు లేక పట్టణాలకు వలసలు వస్తున్నారు. పల్లెల నుంచి వచ్చిన రజకులు ఎక్కువ శాతం అపార్ట్‌మెంట్లలో వాచ్‌మెన్‌లుగా పని చేస్తున్నారు. ఆడవారు ఇళ్లలోకి పోయి అక్కడే బట్టలు ఉతికి వస్తున్నారు. పల్లెల్లో సంవత్సరమంతా ఉతికి సంవత్సరానికోసారి పండిన ధాన్యాన్ని నిర్ణయించుకున్న విధంగా మేరగా ఇచ్చేవారు. ప్రస్తుత పరిస్థితులకనుగుణంగా ధరలు పెరిగిపోయాయి. మేరలు పెంచాలని అడిగితే ఊరి నుంచి వెలి వేయడం, కులం పేరుతో దూషించడం, దాడులు చేయడం వంటివి చేస్తున్నారు.

అమలుకు నోచని హామీలు

తాము అధికారంలోకి వస్తే వృత్తిదారులకు స్వయం ఉపాధి ద్వారా రూ.10 వేల కోట్లతో ఉపాధి అవకాశాలు కల్పిస్తామని కూటమి ప్రభుత్వం హామీ ఇచ్చింది. అధికారం చేపట్టి ఏడాది పూర్తయినా ఒక్క వృత్తిదారునికి కానీ, వారి కుటుంబంలో ఒక బిడ్డకు ఒక్క రూపాయి కూడా ఇవ్వలేదు. రజక వృత్తిదారులకు దోభీఘాట్ల నిర్మాణాలకు ప్రోత్సాహం, విద్యుత్‌లో రాయితీలు ఏమీ ఇవ్వలేదు. జిఒ 343 ప్రకారం చెరువుల్లో దోభీఘాట్ల స్థలాలపై పూర్తి హక్కు రజకులకే అన్న హామీ అమలు కాలేదు. జిఒ 27 ప్రకారం దోభీ పోస్టులు భర్తీ చేసి రజకులకు ఉపాధి కల్పిస్తామన్నారు. అదీలేదు. అన్ని వృత్తుల్లో ఉన్న వత్తిదారులకు ఆదరణ పథకం రూ.5 వేల కోట్లతో అధునాతనమైన పనిముట్లు ఇస్తామని చెప్పి ఒక్క రూపాయి కూడా ఖర్చు పెట్టింది లేదు. అధునాతనమైన యంత్రాలు ఇచ్చింది లేదు. వత్తిదారుల సమస్యలు తెలుసుకొని వాటి పరిష్కారానికి జిల్లాలో కలెక్టర్ కన్వీనర్‌గా రజక వత్తిదారుల సమన్వయ కమిటీ సమావేశాలు నిర్వహించి.. వారి అవసరాలు తెలుసుకుని ప్రభుత్వానికి తెలిపి వారికి రావాల్సిన నిధులు, వసతులు కల్పించాల్సి ఉంది. అదీ జరగడం లేదు.

ఎస్సీ, ఎస్టీ తరహాలో రక్షణ చట్టం అవసరం

- సి.గురుశేఖర్, ఎపి రజకవృత్తిదారుల సంఘం రాష్ట్ర అధ్యక్షులు



ఎస్సీ, ఎస్టీ అత్యాచార నిరోధక చట్టం తరహాలో రజక వృత్తిదారులకు చట్టం రూపొందించాలి. రజక వత్తిదారులకు బట్టలు ఉతకడంతోపాటు గతంలో కొన్ని సామాజిక బాధ్యతలుండేవి. ముట్టు బట్టలను ఉతకడం, ఆడపిల్లలు సమర్థాడినప్పుడు, పురుడుపోసినప్పుడు స్నానం చేయించడం. పెళ్లి, చావు వంటి శుభ, అశుభ కార్యాలకు దివిటి పట్టడం వంటివి కొన్ని ప్రాంతాలకే పరిమితయ్యాయి. అత్యధిక గ్రామాల్లో ఆ వృత్తి లేదు. పాత సంప్రదాయాలను మరువలేని వారు ఆ సమయానికి ఒక చాకలిని అద్దెకు పిలిపించి తూతూమంత్రంగా తతంగాన్ని ముగిస్తున్నారు. ఇలాంటివి పోవడం మంచిదే కానీ వారికి గ్రామాల్లో ఉపాధి లేకపోవడం బాధాకరం. దానికి ప్రభుత్వం పూర్తి బాధ్యత వహించి ఉపాధి కల్పించాలి.

కార్పొరేషన్ సొసైటీల ద్వారా రుణాలివ్వాలి

- శేషాద్రి, ఎపి రజక వృత్తిదారుల సంఘం నగర కార్యదర్శి



కార్పొరేషన్ సొసైటీలను పునరుద్ధరించి సబ్సిడీ రుణాలు ఇస్తామన్న హామీ అమలుకు నోచలేదు. 50 ఏళ్ల నిండిన వారికి పింఛన్లు ఇస్తామన్నారు. దోభీఘాట్లు మరమ్మతులు చేసేందుకు నీటి తొట్లు ఏర్పాటు చేస్తామన్నారు. దాని ఊసే లేదు. జిఒ 27 అమలు చేసి వృత్తిదారులకు ఉద్యోగాలు ఇస్తామని, కాంట్రాక్టు పద్ధతి రద్దు చేస్తామని హామీఇచ్చారు. ప్రతి దేవస్థానం కమిటీలో నామినేటెడ్ పదవి ఇస్తామన్నారు. హామీలన్నీ నీటిమూటలే అయ్యాయి.

వేతనాలు తక్కువ.. చాకిరి ఎక్కువ

- శ్రీనివాసులు, న్యూ పోస్టల్ కాలనీ



పట్టణాలకు వలస వచ్చి అపార్ట్‌మెంట్లలో వాచ్‌మెన్‌గా ఉన్నారు. వారికి వేతనాలు తక్కువగా ఇచ్చి చాకిరి చేయిస్తున్నారు. ఇంటి యజమానులు కొందరు మాట వినని వారి పట్ల అసభ్య మాటలతో, కులం పేరుతో దూషిస్తూ దాడులకు దిగుతున్నారు. లేబర్ కార్డులు ఇచ్చి ప్రభుత్వ సంక్షేమ పథకాలు అమలు చేయాలి. రజక వత్తి చేసుకునే వారికి ప్రత్యేకంగా మీటర్ ఏర్పాటు చేసి 250 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్ అందేలా చర్యలు తీసుకోవాలి. వారి కష్టానికి తగ్గ కనీస వేతనం రూ.12 వేలు ఇవ్వాలి.

మహిళలకు రక్షణ కల్పించాలి

- రేణుక, కల్లూరు



ఇళ్ల వద్ద వృత్తి చేసే మహిళలకు రక్షణ లేదు. రక్షణ చట్టం తేవాలి. రజకులకు ఎస్సీ తరహాలో రక్షణ చట్టం చేయాలి. 50 ఏళ్లు పైబడిన మహిళలకు రూ.5 వేల పింఛన్ ఇవ్వాలి. గురుకులాల్లో రజకుల ఆడపిల్లలకు ప్రత్యేకంగా సీట్లు కేటాయించాలి.

శ్రీశైలం గేట్లు ఎత్తిన సిఎం

- 4 గేట్ల ద్వారా దిగువ నాగర్జున సాగర్‌కు నీరు విడుదల

ప్రజాశక్తి - శ్రీశైలం ప్రాజెక్ట్

నదీ జలాలే మన సంపదని, వాటితోనే రైతుల కష్టాలు తీరుతాయని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అన్నారు. మంగళవారం శ్రీశైలంలో సిఎం చంద్రబాబు నాయుడు పర్యటించారు. ఉండవల్లి నివాసం నుంచి హెలికాప్టర్ ద్వారా సున్నిపెంటలోని హెలిప్యాడ్‌కు 12:05 గంటలకు చేరుకున్నారు. హెలిప్యాడ్ వద్ద సిఎంకు రాష్ట్ర న్యాయ, మైనారిటీ సంక్షేమ మంత్రి ఎన్‌ఎండి.ఫరూక్, జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు, రాష్ట్ర రోడ్లు, భవనాల శాఖ మంత్రి బిసి.జనార్ధన్ రెడ్డి, నంద్యాల ఎంపీ బైరెడ్డి శబరి, జిల్లా కలెక్టర్ జి.రాజకుమారి, డిఐజి ప్రవీణ్ కుమార్, జిల్లా ఎస్పీ అధిరాజ్ సింగ్ రాణా, జెసి సి.విష్ణుచరణ్, శ్రీశైలం, నందికొట్కూరు, ఆళ్లగడ్డ ఎమ్మెల్యేలు బుడ్డా రాజశేఖర్‌రెడ్డి, గిత్త జయసూర్య, భూమా అఖిలప్రియ, నంద్యాల ఆర్గేడ్ విశ్వనాథ్, జిల్లా అధ్యక్షులు మల్లెల రాజశేఖర్ తదితరులు స్వాగతం పలికారు. అనంతరం 12:40 గంటలకు ఆలయం వద్దకు ముఖ్యమంత్రి రోడ్డు మార్గాన బయలుదేరి వెళ్లారు. భ్రమరాంబ మల్లికార్జున స్వామి ఆలయానికి విచ్చేసిన సిఎంకు ఆలయ సంప్రదాయం ప్రకారం అర్చకులు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. శ్రీశైల భ్రమరాంబిక మల్లికార్జున స్వామిని దర్శించుకున్నారు. అనంతరం స్వామి అమ్మవార్ల అర్చన కార్యక్రమంలో పాల్గొని భక్తిశ్రద్ధలతో ముఖ్యమంత్రి పూజలు నిర్వహించారు. ఆలయంలో రుద్రహోమం, పూర్ణాహుతి కార్యక్రమంలో ముఖ్యమంత్రి పాల్గొన్నారు. అనంతరం కార్యక్రమంలో స్వామివారి మండపంలో వేద పండితులు ముఖ్యమంత్రికి వేద ఆశీర్వచనం చేసి తీర్థ ప్రసాదాలు అందజేశారు. అనంతరం ముఖ్యమంత్రి సంప్రదాయ పట్టు వస్త్రాలతో శ్రీశైలం ప్రాజెక్టు వద్దకు మధ్యాహ్నం 2.10 గంటలకు చేరుకున్నారు. శ్రీశైలం ప్రాజెక్టుకు సంబంధించి ఇరిగేషన్ శాఖ అక్కడ ఏర్పాటు చేసిన ఛాయాచిత్ర ప్రదర్శనను, రాయలసీమ ప్రాజెక్టుల స్కీమాటిక్ రేఖాచిత్రం మ్యాపును సిఎం తిలకించారు. ప్రాజెక్టుకు సంబంధించిన అంశాలను అధికారులు ముఖ్యమంత్రికి వివరించారు. అనంతరం వేద పండితుల ఆధ్వర్యంలో పూజా కార్యక్రమాలు నిర్వహించిన తర్వాత కృష్ణమ్మకు సిఎం జల హారతులు ఇచ్చి, పట్టు వస్త్రాలు సమర్పించారు. శ్రీశైలం ప్రాజెక్టులోని 6, 7, 8, 11 రేడియల్ గేట్లను తెరచి నీటిని దిగువ నాగార్జునసాగర్‌కు వదిలారు. అనంతరం సున్నిపెంటలో నిర్వహించిన ప్రజావేదికలో సిఎం పాల్గొని ప్రసంగించారు. జులైలోనే శ్రీశైలం నిండుగా ఉండటం శుభపరిణామమన్నారు. అనంతరం హెలికాప్టర్ ద్వారా శ్రీశైలం జలాశయాన్ని నదీ పరివాహ ప్రాంతాలను పరిశీలించారు. దేవదాయ శాఖ సెక్రెటరీ వినయ్ చంద్, కమిషనర్ రామచంద్ర మోహన్, ఆలయ ఈవో శ్రీనివాసరావు, జల వనరుల శాఖ సీఈ ఎస్.కబీర్ భాష, ఇరిగేషన్ అధికారులు, జేఈవో, పిఆర్వోలు, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

పారిశుధ్యం, తాగునీటి క్లోరినేషన్‌పై దృష్టి

-17 లోపు బిఎల్‌ఒలకు శిక్షణ

- కలెక్టర్ పి. రంజిత్ బాషా

ప్రజాశక్తి-కర్నూలు కలెక్టరేట్

జిల్లాలో వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో గ్రామాల్లో పారిశుధ్యం తాగునీటి క్లోరినేషన్ పై అధికారులు దృష్టి సారించాలని జిల్లా కలెక్టర్ పి. రంజిత్ ఆదేశించారు. మంగళవారం ఆర్‌డిఒలు, నియోజకవర్గ స్పెషల్ ఆఫీసర్లు,, మండల స్పెషల్ ఆఫీసర్లు, ఎంపిడిఒలు, తహసీల్దార్లు, మున్సిపల్ కమిషనర్లు, ఇఒఆర్‌డిలు తదితరులతో జిల్లా కలెక్టర్ టెలి కాన్ఫరెన్స్ నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ అన్ని ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలు, ప్రభుత్వ, ప్రైవేటు జూనియర్ కళాశాలల్లో మెగా పేరెంట్స్ టీచర్స్ మీటింగ్ పక్కాగా జరగాలన్నారు. ప్రజా ప్రతినిధులకు, తల్లిదండ్రులకు, పూర్వ విద్యార్థులకు అందరికీ ఆహ్వానాలు అందేలా చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమానికి సంబంధించి అప్రూవల్ బ్యాక్ డ్రాప్ వస్తుందని, దానిని మాత్రమే కార్యక్రమంలో ఏర్పాటు చేయాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. విద్యార్థులకు యూనిఫామ్స్, మొక్కలు, హోలిస్టిక్ కార్డ్స్ అన్నీ రేపు మధ్యాహ్నం లోపు అన్ని ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలలకు, ప్రభుత్వ, ప్రైవేట్ కళాశాలలకు అందేలా చూడాలని కలెక్టర్ విద్యా శాఖ అధికారులను ఆదేశించారు. తల్లికి వందనం పథకం అమల్లో భాగంగా ఆధార్ నమోదులో పొరపాట్లు రేషన్ కార్డులు, భూమికి సంబంధించిన సమస్యలపై వాళ్లు ఫిర్యాదులు వచ్చాయని వీటిని రేపు సాయంత్రం లోపు పరిష్కరించాలన్నారు. పి 4 పాలసీలో భాగంగా జిల్లాలకు నిర్దేశించిన 50701 బంగారు కుటుంబాలను 10 రోజుల్లోపు దత్తత తీసుకునేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు..పారిశ్రామికవేత్తలు, చదువుకున్న వారు, బయట ఉన్నవారు. ఉద్యోగులు ఎవరైనా ముందుకు రావచ్చని, అలాంటివారిని గుర్తించాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. పీఎం సూర్య ఘర్ పథకం కింద 8483 దరఖాస్తులు రిజిస్టర్ కాగా, ఇందులో 652 మాత్రమే పూర్తి చేశారన్నారు, మిగిలిన లక్ష్యాన్ని త్వరితగతిన పూర్తి చేయాలని కలెక్టర్ ఆదేశించారు. దేవనకొండ, చిప్పగిరి, మంత్రాలయం, హాలహర్వి, మద్దికెర, కృష్ణగిరి మండలాల ఎఇలకు షోకాజ్ నోటీసులు జారీ చేయాలని కలెక్టర్ ఎస్‌పిడిసిఎల్ ఎస్ఇని ఆదేశించారు. ఈ నెల 8 నుంచి 17వ తేదీ వరకు బిఎల్‌ఒల శిక్షణ పూర్తిచేయాలని, ఇఆర్‌ఒల ఆదేశించారు. జాయింట్ కలెక్టర్ డాక్టర్ బి.నవ్య, ఆదోని సబ్ కలెక్టర్ మౌర్య భరద్వాజ్, డిఆర్‌ఒ సి.వెంకట నారాయణమ్మ, ఆర్‌డిఒలు సందీప్ కుమార్, భరత్ నాయక్, జిల్లా విద్యాశాఖ అధికారి శామ్యూల్ పాల్ పాల్గొన్నారు.




నేడు సార్వత్రిక సమ్మె

- జిల్లా పరిషత్ నుంచి కలెక్టరేట్ వరకు ప్రదర్శన

- మండల కేంద్రాల్లో నిరసన ప్రదర్శనలు

ప్రజాశక్తి-కర్నూలు కార్పొరేషన్

ప్రభుత్వ రంగ సంస్థల పరిరక్షణ కోసం ఈనెల 9న జిల్లా వ్యాప్తంగా ఉద్యోగ, కార్మిక, ప్రజాసంఘాలు సమ్మెలో పాల్గొంటున్నాయి.



ప్రత్యేక సంచికను ఆవిష్కరిస్తున్న నాయకులు

జిల్లా కేంద్రంలో జిల్లా పరిషత్ నుంచి కలెక్టరేట్ వరకు ప్రదర్శన నిర్వహిస్తున్నామని సిఐటియు జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు పిఎస్.రాధాకృష్ణ, ఎండి.అంజిబాబు ఒక ప్రకటనలో తెలిపారు. కేంద్ర కార్మిక సంఘాలు, ఉద్యోగ, ఉపాధ్యాయ సంఘాల ఐక్యవేదిక కేంద్ర ప్రభుత్వ ప్రజావ్యతిరేక విధానాలను, నాలుగు లేబర్ కోడ్ లను రద్దు చెయ్యాలని కోరుతూ దేశవ్యాప్త సమ్మెకు పిలుపు నిచ్చిందన్నారు. ఈ సమ్మెకు మద్దతుగా సంయుక్త కిసాన్ మోర్చా, దేశవ్యాప్తంగా ఉన్న వ్యవసాయ కార్మిక సంఘాలు గ్రామీణ బంద్‌కు పిలుపునిచ్చాయి. అవే ప్రజావ్యతిరేక విధానాలు ప్రభుత్వరంగ ఆర్థిక సంస్థలైన బ్యాంకులు, ఇన్సూరెన్స్ రంగాలను కూడా ప్రభావితం చేస్తున్నాయన్నారు. వాటి మనుగడకే ప్రమాదంగా తయారయిందన్నారు. సిఐటియు, ఎఐటియుసి, ఐఎన్‌టియుసి, ఐఎఫ్‌టియు, ఎఐయు టియుసి కార్మిక సంఘాలు సమ్మెకు నాయకత్వం వహిస్తున్నాయన్నారు. వీటితోపాటు బ్యాంకు ఉద్యోగ సంఘాలు ఎఐబిఇఎ, ఎఐబిఎ, బిఇఎఫ్ఐ, ఎఐఆర్‌బిఇఎ, ఇన్సూరెన్స్ ఉద్యోగ సంఘాలు, ఎఐఐఇఎ, ఎఐఎల్ఇఎఫ్, జిఐఇఎఐఎ సంఘాలు సమ్మెలో పాల్గొంటున్నాయని పేర్కొన్నారు.

సమ్మె విజయవంతానికి ఎల్ఐ ఉద్యోగుల పిలుపు

దేశవ్యాప్త సమ్మెను జయప్రదం చేయాలని ఎల్ఐసి ఉద్యోగుల సంఘం కార్యదర్శి సునియా కుమార్, సిఐటియు జిల్లా అధ్యక్ష కార్యదర్శులు పిఎస్.రాధాకృష్ణ ఎండి.అంజిబాబు కోరారు. సమ్మె జయప్రదం కావాలని కోరుతూ ప్రజాశక్తి ప్రత్యేక సంచిక ఆవిష్కరణను ఎల్ఐసి కార్యాలయం ఆవరణములో చేశారు. ఎల్ఐసి బ్రాంచ్ చీఫ్ మేనేజర్ కాంతారావు బ్రాంచ్ మేనేజర్ శ్రీదేవి ఎల్ఐసి ఏజెంట్స్ యూనియన్ నాయకులు వెంకటేష్, ఎల్ఐసి యూనియన్ నాయకులు, రమేష్ ఉస్మాన్ గని క్రాంతి కుమార్, ఉస్మాన్‌బాష తదితరులు పాల్గొన్నారు. వారు మాట్లాడుతూ ప్రభుత్వ రంగ సంస్థలైన ఎల్ఐసి బ్యాంక్స్ రైల్వే రంగాల్లో లక్షలాది ఉద్యోగాలు ఖాళీ ఉన్నాయని వాటిని వెంటనే భర్తీ చేయాలని డిమాండ్ చేశారు. ఎల్ఐసి రంగం ప్రైవేటు వరం కాకుండా ఉద్యోగులంతా ఉద్యమంలో పాల్గొనాలని కోరారు. ప్రభుత్వ రంగ సంస్థల కాపాడడం కోసం ఉద్యోగులు కార్మికులు ఐక్యంగా ఉద్యమించాల్సిన అవసరం ఏర్పడిందని తెలిపారు. ఈనెల 9న సమ్మెతో మాత్రమే అడ్డుకోగలమని చెప్పారు.



శరీన్ నగర్‌లో కట్ చేసి కార్యకర్తకు తినిపిస్తున్న కాటసాని రాంభూపాల్ రెడ్డి

ఘనంగా వైఎస్ఆర్ జయంతి

ప్రజాశక్తి-కర్నూలు హాస్పిటల్

మాజీ ముఖ్యమంత్రి వైఎస్.రాజశేఖర్‌రెడ్డి 76వ జయంతి సందర్భంగా కల్లూరు అర్బన్ 29వ వార్డు షరీన్‌నగర్ లోని డాక్టర్ వైఎస్ఆర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళ్లు అర్పించారు. నంద్యాల జిల్లా అధ్యక్షులు కాటసాని రాంభూపాల్ రెడ్డి వైఎస్ఆర్ విగ్రహానికి ఘనంగా పూలమాల వేసి నివాళులర్పించి కేక్ కట్ చేసి జయంతి శుభాకాంక్షలు తెలిపారు. స్థానిక కార్పొరేటర్ సంగాల సుదర్శన్ రెడ్డి, యువజన విభాగం అధ్యక్షులు ఎద్దుల శివారెడ్డి, హేమలత, హుస్సేన్ ఆలం, పిడిబాష, భూపాల్‌రెడ్డి, రత్నం, మంగలి ప్రసాద్, బోయ శివకుమార్,గౌడ్ , వైసిపి కార్పొరేటర్లు, దండు లక్ష్మీకాంత రెడ్డి, నారాయణ రెడ్డి, లక్ష్మిరెడ్డి, గాజుల శ్వేతారెడ్డి, నాయకులు బెల్లం మహేశ్వర్ రెడ్డి, అక్కిమి హనుమంత రెడ్డి, పందిపాడు శివశంకర్ రెడ్డి, భీమేశ్వర రెడ్డి, గోపాల్ రెడ్డి, పెద్దన్న, ప్రతాపరెడ్డి, కార్యకర్తలు అభిమానులు వార్డు సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

కర్నూలు కలెక్టరేట్ : కర్నూలు డిసిసి కార్యాలయంలో రాష్ట్ర కాంగ్రెస్ మాజీ ప్రధాన కార్యదర్శి దామోదరం రాధాకృష్ణ, ఐఎన్‌టియుసి ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్షులు ఖాద్రీబాష, కో ఆర్డినేటర్ అనంత రత్నం మాదిగ, ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షులు ఎన్సి బజారన్న వైఎస్ఆన్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళ్లు అర్పించారు.

కోడుమూరు రూరల్: కోడుమూరు జడ్‌పిటిసి రఘునాథరెడ్డి, వైసిపి మండల కన్వీనర్ రమేష్ గుజరాతి శంకరప్ప కాంప్లెక్స్‌లో జిల్లా వైసిపి సాంస్కృతిక విభాగం నాయకులు ప్రవీణ్ ఆధ్వర్యంలో డాక్టర్ వైఎస్ఆర్ జయంతి వేడుకలను వైసిసి నాయకులు, కార్యకర్తలు, అభిమానులు ఘనంగా నిర్వహించారు. ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి నివాళ్లు అర్పించారు.

బైక్ ప్రమాదంలో యువకుడు మృతి

ప్రజాశక్తి-నందవరం



బైకు ప్రమాదములో యువకుడు మరణించిన సంఘటన నందవరం మండలం నాగలదిన్నె గ్రామంలో చోటుచేసుకుంది. గ్రామస్తులు తెలిపిన వివరాల మేరకు ...తెలుగు భీమన్న (28) పెట్రోల్ బంక్ కు వెళ్లి తిరిగి వస్తూ ఉండగా రాత్రి 8 గంటల సమయంలో గురుజాల రోడ్డు ప్రాంతంలో ప్రమాదానికి గురై మరణించినట్లు చెప్పారు. ప్రమాదవశాత్తు అనుకోని విధంగా బైకు స్లిప్ అయిపడ్డాడా? లేదా ఏదైనా వాహనం ఢీకొని వెళ్లిందా తెలియడం లేదని గ్రామస్తులు తెలిపారు. మృతిని భార్య లింగేశ్వరి, ఆయన కుమార్తె 3 నెలల పాప ఉన్నట్లు చెప్పారు.

అభివృద్ధి పథంలో రాష్ట్రం

ఎమ్మెల్యే బొగ్గుల దస్తగిరి

ప్రజాశక్తి-కర్నూలు క్రైమ్

ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు సారథ్యంలో రాష్ట్రం అభివృద్ధి పథంలో నడుస్తోందని కోడుమూరు ఎమ్మెల్యే బొగుల దస్తగిరి, టిడిపి జిల్లా అధ్యక్షులు పాలకుర్తి తిక్కారెడ్డి అన్నారు. మంగళవారం కర్నూలు మండలం రుద్రవరం గ్రామంలో సుపరిపాలన తొలి అడుగు కార్యక్రమంలో పాల్గొన్నారు. వారు ఇంటింటికి తిరిగి ప్రభుత్వం నిర్వహించిన అభివృద్ధి సంక్షేమ పథకాల గురించి ప్రజలకు వివరించారు. వారు మాట్లాడుతూ సిఎం ఆదేశాల మేరకు,7వ రోజు సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమాన్ని నిర్వహించారన్నారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన సూపర్ సిక్స్ హామీలను ఒక్కొక్కటిగా నెరవేరుస్తూ వస్తున్నామన్నారు. ఆగస్టు 15న మహిళలకు ఆర్‌టిసి ఉచిత బస్సు ప్రయాణం పథకాన్ని ప్రారంభిస్తున్నామన్నారు. మండల అభివృద్ధి అధికారులు, టిడిపి మండల నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.




రుద్రవరం లో కరపత్రం పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే దస్తగిరి, అధ్యక్షుడు తిక్కారెడ్డి

వెన్నుపోటు బ్రాండ్ చంద్రబాబు : వైసిపి

ప్రజాశక్తి-పత్తికొండ

రాష్ట్రంలో వెన్నుపోటు బ్రాండ్ కలిగి ఉన్న ఏకైక ముఖ్యమంత్రిగా చంద్రబాబు చరిత్రలో నిలిచిపోతారని వైఎస్ఆర్ కర్నూలు జిల్లా అధ్యక్షుడు ఎస్వి మోహన్ రెడ్డి అన్నారు. పత్తికొండ పట్టణంలో గోపాల ప్లాజాలో పత్తికొండ వైసిపి నియోజకవర్గ విస్తృత స్థాయి సమావేశం ఇన్చార్జి, మాజీ ఎమ్మెల్యే కంగాటి శ్రీదేవి అధ్యక్షతన ఏర్పాటు చేశారు. కంగాటి శ్రీదేవి మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక వైసిపి నేతలపై అక్రమ కేసులు బనాయిస్తూ, కార్యకర్తల్లో భయాన్ని సృష్టించాలని చూస్తుందన్నారు. కూటమి ప్రభుత్వం ఎన్నికల్లో ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయకుండా పేదల జీవితాల్లో చీకట్లు నింపిందని జగనన్నకు తోడుగా, పేద ప్రజలకు అండగా కూటమి ప్రభుత్వం చేస్తున్న అరాచక పాలనను ఎండగట్టేందుకు కార్యకర్తలు సిద్ధంగా ఉండాలని నేతలు సూచించారు. బాబు ష్యూటీ మోసం గ్యారెంటీ కార్యక్రమంలో భాగంగా గడప-గడపకు వెళ్లి బాబు ఇచ్చిన పథకాలు అమలు చేశారా లేదా అన్న విషయాన్ని ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. బాబు చేసిన మోసాన్ని ప్రజలకు వివరిస్తే రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో పోటీ చేసేందుకు కూడా టిడిపి నాయకులు ఎవరూ ముందుకు రాని పరిస్థితి ఏర్పడుతుందని తెలిపారు. ఎమ్మెల్సీ మధుసూదన్ మాట్లాడుతూ అధికారం కోసం చంద్రబాబునాయుడు ప్రజలను హామీలతో మోసం చేశారన్నారు. కర్నూలు జిల్లా మహిళా విభాగం అధ్యక్షులు ఆలూరు శశికళ ,వైసిపి రాష్ట్ర కార్యదర్శి చెరుకులపాడు ప్రదీప్‌రెడ్డి ,మాజీ ఎంపీపీ నాగరత్నమ్మ మాట్లాడారు. అనంతరం 'చంద్రబాబు ష్యూరిటీ.. మోసం గ్యారెంటీ' పేరుతో క్యూర్ కోడ్ పోస్టర్లను ఆవిష్కరించారు. స్మార్టు ఫోన్ ద్వారా కూటమి ఇచ్చిన హామీలు ఎన్నీ.. ఎగ్గొట్టినవి ఎన్ని.. అనేది చూసుకునే అవకాశం ఉందన్నారు. ఈ కార్యక్రమంలో పత్తికొండ ఎంపిపి నారాయణదాసు, కెడిసిసిబి బ్యాంకు మాజీ వైస్ చైర్మన్ రామచంద్రారెడ్డి , జడ్పిటిసి ఉరుకుందమ్మ, సర్పంచి కొమ్ము దీపిక, బూత్ కమిటీ విభాగ రాష్ట్ర సంయుక్త రాష్ట్ర కార్యదర్శి బనగాని శ్రీనివాసులు , మండల కన్వీనర్ కారం నాగరాజు తదితరులు పాల్గొన్నారు..



'చంద్రబాబు ష్యూరిటీ మోసం గ్యారెంటీ' పేరుతో క్యూర్ కోడ్ పోస్టర్‌ను విష్కరిస్తున్న నేతలు

అవార్డు గ్రహీత దీక్షిత్‌కు ఘన సన్మానం

ప్రజాశక్తి - కర్నూలు కలెక్టరేట్

హౌస్ ఆఫ్ లార్డ్స్ బ్రిటిష్ పార్లమెంట్ యునైటెడ్ కింగ్ డమ్ నుండి ది ఇన్నోవేటర్ ఇన్ ఎడ్యుకేషన్ క్యాటగిరిలో అవార్డు అందున్న సర్వేపల్లి విద్యానిలయం అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ పి.దీక్షిత్‌ను మంగళవారం అభినందిచారు. ఇండియా నుండి కర్నూలు నగరానికి చెందిన పి.దీక్షిత్‌కు బ్రిటిష్ పార్లమెంట్ హౌస్ ఆఫ్ లార్డ్ సభ్యుడు లార్డ్ డానియల్ బ్రెనాన్ చేతుల మీదుగా అవార్డు అందుకుని వచ్చిన సందర్భంగా సర్వేపల్లి విద్యా నిలయం ప్రిన్సిపల్ అరుణ శ్రీ, ఉపాధ్యాయులు, విద్యార్థులు బ్యాండ్ మేళాతో, పూలు జల్లుతూ సాదర స్వాగతం పలికారు. పి.దీక్షిత్‌ను ప్రిన్సిపల్, ఉపాధ్యాయులు ఘనంగా సన్మానించారు. పి.దీక్షిత్ మాట్లాడుతూ ఇండియా నుంచి 12 మంది విద్యా విభాగంలో 8 మందికి అవార్డు వచ్చిందన్నారు. ఈ అవార్డును కుటుంబానికి, స్కూల్ ఉపాధ్యాయలకు అకింతం యిచ్చారు. విద్య అనేది ఒక గొప్ప ఆయుధమని అది ప్రపంచాన్ని మారుస్తుందని అన్నారు. ఉపాధ్యాయ వృత్తి అనేది ఒక ప్యాషన్ అని ఎంతోమంది విద్యార్థులకు జీవితాన్ని అందిస్తుందని తెలిపారు. ప్రస్తుత టీచింగ్‌ఎంతో రెస్పాన్స్‌తోనూ, విలువలతో కూడుకున్నదని అన్నారు. పెరుగుతున్న ఆధునిక టెక్నాలజీని ప్రతి విద్యార్థి అందిపుచ్చుకోవాలని కోరారు. స్కూల్ ప్రిన్సిపల్ అరుణ శ్రీ మాట్లాడుతూ దీక్షిత్ ఇదే పాఠశాలలో చదివి ఇదే పాఠశాలను నడుపుతూ బ్రిటిష్ పార్లమెంటులో అవార్డు పొందడం చాలా ఆనందంగా ఉందని అన్నారు. ఒక కొడుకు ఎదుగుతున్నప్పుడు తల్లిదండ్రులకు ఎంతో ఆనందంగా ఉంటుందని అన్నారు. దీక్షత్ ఈ అవార్డు పొందినందుకు గర్వంగా ఉందని అన్నారు. సర్వేపల్లి కుటుంబం ఈరోజు సంబరం చేసుకోవడం సంతోషంగా ఉందని తెలిపారు. ప్రతి ఒక్క విద్యార్థి గొప్ప వారిని ఆదర్శంగా తీసుకొని అవార్డులు పొందాలని విద్యార్థులను ఆమె కోరారు. ఆధునిక విద్యతో అనేక మార్పులు తెస్తున్న దీక్షిత్‌ను అభినందించారు. సర్వేపల్లి, శ్రీలక్ష్మి స్కూల్ విద్యార్థులకు ఎవరు సరిరారని ఈ విధంగా దీక్షిత్ తీర్చిదిద్దుతున్నారని కొనియాడారు. కుటుంబ సభ్యులు, సర్వేపల్లి విద్య నిలయం ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.



దీక్షిత్‌ను సన్మానిస్తున్న ప్రిన్సిపల్ తదితరులు



ఓల్డుసిటీ సమ్మె ప్రచారంలో మాట్లాడుతున్న విజయ్ రామాంజనేయులు

సమ్మెజయప్రదానికి ప్రచారం

ప్రజాశక్తి-కర్నూలు కార్పొరేషన్

సమ్మెను జయప్రదం చేయాలని సిఐటియు ఓల్డ్ సిటీ ప్రధాన కార్యదర్శి విజయ రామాంజనేయులు కోరారు. సిఐటియు ఓల్డ్ సిటీ కమిటీ ఆధ్వర్యంలో సిఐటియు నగర అధ్యక్షులు అబ్దుల్ దేశాయ్ అధ్యక్షతన సూర్జిత్ భవన్ నుండి పూలబజార్, వన్‌టౌన్ పోలీస్ స్టేషన్ చిత్తారి గేరి నాలుగురాస్తాలు, చిన్నమార్కెట్ మీదుగా కార్మిక, రైతు, ఉద్యోగ సంఘాలు, ప్రజాసంఘాల ఆధ్వర్యంలో జరిగే సార్వత్రిక సమ్మెను జయప్రదం చేయాలని కోరుతూ ప్రదర్శన నిర్వహించారు. నగర ప్రధాన కార్యదర్శి విజయ రామాంజనేయులు, నగర ఉపాధ్యక్షులు రాజశేఖర్ మాట్లాడారు.

పత్తికొండ:




సార్వత్రిక సమ్మెను జయప్రదం చేయాలని సిఐటియు జిల్లా నాయకులు వెంకటేశ్వర్ రెడ్డి, ఎఐటియుసి జిల్లా నాయకులు ఎన్. కృష్ణ కోరారు. పత్తికొండ పట్టణంలోని ఆర్ అండ్ బి గెస్ట్ హౌస్ నుండి సిఐటియు, ఎఐటియుసి, నాయకులు బైక్ ర్యాలీను అంబేద్కర్ సర్కిల్ వరకు నిర్వహించారు. సిఐటియు నాయకులు రవిచంద్ర, ఎఐటియుసి నెట్టికంటయ్య, హమాలి నాయకులు తదితరులు పాల్గొన్నారు.

లాడ్జీలలో ఆకస్మిక తనిఖీలు

-రాత్రి వేళ గస్తీ పటిష్టం

ప్రజాశక్తి-కర్నూలు క్రైమ్



రాత్రి గస్తీని పటిష్టం చేసి నేరాల నియంత్రణకు కృషి చేయాలని కర్నూలు జిల్లా ఎస్పి విక్రాంత్ పాటిల్ పోలీసు అధికారులను ఆదేశించారు. జిల్లా ఎస్పి ఆదేశాల మేరకు కర్నూలు పోలీసులు రాత్రి వేళల్లో గస్తీని పటిష్టం చేశారు. సోమవారం అర్ధరాత్రి లాడ్జీలలో ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. లాడ్జిలలో ఎవరైనా అనుమానస్పదంగా కనిపిస్తే వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని సూచించారు. అనుమానం వ్యక్త పరిచిన వారి వివరాలను ఆరా తీశారు. లాడ్జిలలో రాత్రి బస చేసే వ్యక్తుల గుర్తింపు కార్డులు తీసుకొని వివరాలు నమోదు చేయాలన్నారు. పరిసరాలు స్పష్టంగా కన్పించేలా తప్పనిసరిగా సిసి కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని లాడ్జీల యజమానులు పోలీసులకు సహకరించాలని సూచించారు. మొబైల్ సెక్యూరిటీ చెక్ డివైస్‌తో రాత్రి వేళల్లో ఎటువంటి నేరాలు జరగకుండా రాత్రి గస్తీని పటిష్ట చేశారు. అనుమానాస్పదంగా కనిపించే వ్యక్తుల వేలి ముద్రలను సేకరించారు.

పేదరిక నిర్మూలనే ధ్యేయం : ఎమ్మెల్యే బీవీ

ప్రజాశక్తి - ఎమ్మిగనూరు



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే బీవీ

పేదరికం లేని సమాజాన్ని నిర్మించడమే ధ్యేయంగా కూటమి ప్రభుత్వం పని చేస్తోందని ఎమ్మెల్యే డాక్టర్ బీవీ.జయ నాగేశ్వర రెడ్డి తెలిపారు. మంగళవారం ఎంపిడిఒ కార్యాలయంలో స్వర్ణాంధ్ర విజన్-2047లో భాగంగా నియోజకవర్గ విజన్ యాక్షన్ ప్లాన్ యూనిట్ పి4పై సంబంధిత అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ముఖ్యమంత్రి చంద్రబాబు సారథ్యంలో పక్కా ప్రణాళికలతో.. 2047 నాటికి రాష్ట్రాన్ని సున్నా పేదరికం సాధించడమే ధ్యేయంగా ముందుకెళ్తున్నట్లు తెలిపారు. పి4 అమలు, ప్రధాన సమస్యల పరిష్కారం, అనేక అంశాలపై సంబంధిత అధికారులతో చర్చించామని వెల్లడించారు. పేదలకు ఆర్థిక సాధికారత చేకూర్చడంతో పాటు జీవన ప్రమాణాల్లో అట్టడుగు స్థాయిలో ఉన్న నియోజకవర్గంలో 5,740 మంది మార్గదర్శి-బంగారు కుటుంబాలను గుర్తించామని తెలిపారు. ఆ కుటుంబాలకు ఉపాధి కల్పించి అన్ని విధాలుగా ఆదుకుంటామని చెప్పారు.

అభివృద్ధి, సంక్షేమం రెండు కళ్లు

- టిడిపి ఇన్‌ఛార్జీ మీనాక్షి నాయుడు

ప్రజాశక్తి - ఆదోని


మాట్లాడుతున్న మీనాక్షి నాయుడు

రాష్ట్రంలో అభివృద్ధి, సంక్షేమం రెండు కళ్లలాగా భావిస్తూ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు పాలన సాగిస్తున్నారని మాజీ ఎమ్మెల్యే, నియోజకవర్గ ఇన్‌ఛార్జీ మీనాక్షి నాయుడు తెలిపారు. మంగళవారం పట్టణంలోని ఆలూరు రోడ్డు ప్రకాష్ నగర్‌లో సుపరిపాలన తొలి అడుగు నిర్వహించారు. మాజీ ఇన్‌ఛార్జీ గుడిసె ఆది కృష్ణమ్మ, తిమ్మప్ప, అప్సర బాష, శ్రీకాంత్ రెడ్డి, ఉమ్మి సలీం, ఫక్రుద్దీన్, బసాపురం వెంకటేష్, గుడిసె శ్రీరాములు, రామస్వామి, రంగస్వామి నాయుడు, నారాయణ, చిట్టి, మదిరే వీరేష్, వేణుగోపాల్ రెడ్డి, బుద్ధారెడ్డి, రాయ నగర్ శంకర్, సోమశేఖర్ రెడ్డి, రామచంద్ర, నాగరాజు ఉన్నారు.

వాలంటీర్లకు ఏర్పాట్లపై సమీక్ష

ప్రజాశక్తి - మంత్రాలయం


మాట్లాడుతున్న అధికారులు

మంత్రాలయంలోని శ్రీరాఘవేంద్ర స్వామి మఠంలో నిర్వహించే రాఘవేంద్ర స్వామి ఆరాధన మహోత్సవాల్లో సేవలందించే వాలంటీర్లకు వసతి, భోజన సదుపాయాల ఏర్పాట్లపై సమీక్ష నిర్వహించారు. మంగళవారం స్థానిక శ్రీమఠంలో పీఠాధిపతులు శ్రీసుభుదేంద్రతీర్థుల ఆదేశాల మేరకు శ్రీమఠం మేనేజర్లు ఎస్‌కె.శ్రీనివాస రావు, సురేష్ కోనాపూర్, ఆధ్యాత్మిక అభివృద్ధి అధికారి శ్రీపతి ఆచార్, అసిస్టెంట్ మేనేజర్ ఐపి.నరసింహ మూర్తి సిబ్బందితో కలిసి చర్చించారు. సుమారు 2 వేల మంది వాలంటీర్లకు వసతి, భోజన సదుపాయం కల్పించేందుకు ప్రణాళిక సిద్ధం చేయాలని సూపరింటెండెంట్ పురాణిక అనంతాచార్‌కు సూచించారు.

ఎల్‌ఎల్‌సి అన్యాక్రాంతంపై నోటీసులు

- డిప్యూటీ ఇంజినీర్ షఫీవుల్లా

ప్రజాశక్తి - ఆదోని



తుంగభద్ర దిగువ కాలువపై అక్రమ కట్టడాలు నిర్మించుకున్న వారికి రెవెన్యూ అధికారుల ద్వారా నోటీసులు జారీ చేయించామని ఇరిగేషన్ డిప్యూటీ ఇంజినీర్ షఫీవుల్లా తెలిపారు. మంగళవారం కార్యాలయంలో ఆయన వివరాలు వెల్లడించారు. ఎల్ఎల్‌సి డిపి 65 పంట కాలువ ద్వారా తమ పొలానికి నీరు రావడం లేదని రైతు అయ్యన్న ప్రజా సమస్యల పరిష్కార వేదికలో సబ్ కలెక్టర్‌కు అర్జీ ఇచ్చారని తెలిపారు. సబ్ కలెక్టర్, ఇరిగేషన్ ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు తహశీల్దార్, పంచాయతీ అధికారుల సమక్షంలో పెద్దహరివాణం గ్రామానికి చేరుకొని పంట కాలువను పరిశీలించామన్నారు. పంట కాలువపై పెద్దహరివాణం గ్రామానికి చెందిన 12 మంది నిర్మాణాలు చేపట్టారని గుర్తించామని తెలిపారు. స్వచ్ఛందంగా అక్రమ కట్టడాలు తొలగించుకోవాలని, లేకపోతే కూల్చేస్తామని ఏడు రోజులు గడువు విధిస్తూ తహశీల్దారు నోటీసులు జారీ చేశారని చెప్పారు. శుక్రవారం వరకు గడువు ఉందని, ఆలోపు నిర్మాణాలు తొలగించకపోతే కూల్చేస్తామని తెలిపారు. సుమారు కిలోమీటర్ మేర కాలువ అన్యాక్రాంతానికి గురైందన్నారు. రికార్డుల ఆధారంగా సర్వే చేసి ఇప్పటికే అన్యాక్రాంతమైన నిర్మాణాలకు గుర్తులు వేశామని తెలిపారు. కాలువపై నిర్మాణాలను తొలగించి ఆయకట్టు 50 ఎకరాల పంట పొలాలకు నీరు చేరేలా చర్యలు తీసుకుంటామన్నారు. అన్యాక్రాంతం చేసిన వారు స్వచ్ఛందంగా తొలగించుకోవాలని తెలిపారు.

ట్యాంకు పటిష్టమయ్యేనా..?

- నేడు ట్యాంకును సందర్శించనున్న సెంట్రల్ ఇంజినీర్స్ బృందం

ప్రజాశక్తి - ఆదోని

బసాపురం సమ్మర్ స్టోరేజ్ ట్యాంకు పటిష్టతపై సందేహాలు నెలకొన్నాయి. ఆదోని ప్రజల దాహార్తి తీర్చే బసాపురం సమ్మర్ స్టోరేజ్ నీటి ట్యాంకు గోడలు మళ్లీ పగుళ్లు ఇచ్చాయి. ఇప్పటికే రెండుసార్లు పగుళ్లు ఇవ్వగా అధికారులు మరమ్మతుల కోసం రూ.లక్షలు ఖర్చు చేశారు. మళ్లీ గోడలు కుంగిపోవడంతో ఆదోని ప్రజలకు నీరు ఎలా అన్న ప్రశ్న తలెత్తుతోంది. విషయం తెలుసుకున్న మున్సిపల్ సూపరింటెండెంట్ ఆఫ్ ఇంజినీర్ రామ్మోహన్ రెడ్డి గత గురువారం తనిఖీ చేశారు. ఇప్పటికే పలు దఫాలుగా సైడ్ వాల్ కుంగడంతో మరమ్మతులు ఎలా చేయించాలో తెలియక తలలు పట్టుకుంటున్నారు.


సైడ్ వాల్ కుంగిన ఎస్ఎస్ ట్యాంకు

ఆదోని ప్రజలకు ఇక్కడి నుంచే నీరు సరఫరా చేయాల్సి ఉంది. ఎల్ఎల్‌సికి ఈనెల 10కి నీటి ప్రవాహం రానుంది. ఆ నీటితో ట్యాంకును నింపాల్సి ఉంది. ఈ సమయంలోనే ట్యాంకు మళ్లీ కుంగడంతో నీటి నిల్వకు సమస్యగా మారింది. సమ్మర్ స్టోరేజ్ ట్యాంకు విస్తీర్ణం 3,200 మీటర్లు ఉంది. అందులో 3,110 మిలియన్ లీటర్ల నీటి సామర్థ్యం నిల్వకు అవకాశం ఉండేది. ప్రస్తుతం 60 శాతానికి మించి నీరు నిల్వ చేయలేమని అధికారులు చెబుతున్నారు. 20 రోజులకు సరిపడు నీరు ట్యాంకులో ఉన్నట్లు పేర్కొంటున్నారు. 2005లో సుమారు రూ.30 కోట్ల వ్యయంతో ఎస్ఎస్ ట్యాంకు నిర్మాణం జరిగింది. ఆదోని పట్టణ జనాభా 1,50,000కు పైగా ఉందని అధికారులు చెబుతున్నారు. రోజువారీగా 20 మిలియన్ లీటర్ల నీరు సరఫరా చేస్తున్నట్లు చెబుతున్నారు.

లక్షలాది రూపాయలు గంగపాలు

బసాపురం సమ్మర్ స్టోరేజ్ ట్యాంకు ఇప్పటికే పలుసార్లు సైడ్ బండ్ కుంగింది. ట్యాంకు 3,200 మీటర్ల విస్తీర్ణం ఉంది. దక్షిణం 550 మీటర్లు, పడమర 1200, ఉత్తరం 450 మీటర్లు, తూర్పు 1,150 మీటర్ల వైశాల్యంలో ట్యాంకు నిర్మాణం జరిగింది. 2005లో వాడకంలోకి వచ్చింది. ట్యాంకు చుట్టూ ముళ్లపొదలు విస్తరించకుండా చూడాల్సి ఉంది. కొందరి నిర్లక్ష్యం వల్ల మొదట్లో సైడ్ వాల్ బండ్ 90 మీటర్లు, మరో దఫా 100 మీటర్లు, ప్రస్తుతం 60 మీటర్లు కుంగింది. గతంలో కుంగిన బండ్ నిర్మాణ పనులకు సుమారు రూ.కోటి ఖర్చు చేశారు. పని పూర్తయి నెలలు గడవకముందే మరో మారు బండ్ కుంగడంతో విమర్శలు వెల్లువెత్తాయి. ప్రజాధనాన్ని గంగపాలు చేశారని విమర్శలు వచ్చాయి.

స్పష్టత వచ్చేనా..? : సమ్మర్ స్టోరేజ్ ట్యాంకు స్పష్టతపై నీలి నీడలు కమ్ముకున్నాయి. పదే పదే మరమ్మతుల పేరుతో నిధులు కేటాయిస్తూ ఉండడంతో ప్రజల్లో అనుమానాలు తలెత్తుతున్నాయి. ట్యాంకు పటిష్టతపై సెంట్రల్ డిజైన్ చీఫ్ ఇంజినీర్ల సలహాలు తీసుకోవాలని కోరగా బుధవారం కేంద్ర బృందం ట్యాంకును సందర్శించనుంది. వారి సూచన మేరకు ట్యాంకు బండ్ పటిష్టతకు చర్యలు చేపడతామని ఇంజినీరింగ్ అధికారులు చెబుతున్నారు. సుమారు రూ.40 కోట్లతో బండ్ నిర్మాణం జరిగితే పటిష్టంగా ఉంటుందని అంటున్నారు. పరిశీలించే కేంద్ర బృందం ఎలాంటి సూచన చేస్తుందో వేచి చూడాలి.

తాగునీటికి ఇబ్బంది లేకుండా చూస్తాం

- వెంకట చలపతి రెడ్డి, ఇంజనీర్



పట్టణ ప్రజలకు తాగునీటి ఎద్దడి రాకుండా జాగ్రత్తలు తీసుకుంటాం. ఎల్ఎల్‌సి ద్వారా సమ్మర్ స్టోరేజ్ ట్యాంకులో నిల్వ చేస్తూనే రాంజల చెరువుకు పంపింగ్ చేయిస్తాం. ఓవర్‌హెడ్ ట్యాంకుల ద్వారా పట్టణ ప్రజలకు నీరు సరఫరా చేస్తాం. తాగునీటి ఎద్దడి వస్తుందన్న భయాందోళన అవసరం లేదు. ఎప్పటికప్పుడు జాగ్రత్తలు తీసుకుంటున్నాం.

మరో 35 కేంద్రాలకు ప్రతిపాదనలు

- ఎన్నికల రిటర్నింగ్ అధికారి అనురాధ

ప్రజాశక్తి - మంత్రాలయం

నియోజకవర్గంలో మరో 35 పోలింగ్ కేంద్రాల కోసం కలెక్టర్‌కు ప్రతిపాదనలు పంపుతున్నామని స్పెషల్ డిప్యూటీ కలెక్టర్, నియోజకవర్గ ఎన్నికల రిటర్నింగ్ అధికారి కె.అనురాధ తెలిపారు. మంగళవారం స్థానిక తహశీల్దార్ కార్యాలయంలో తహసీల్దార్ కె.రమాదేవితో కలిసి నియోజకవర్గ స్థాయిలో వివిధ పార్టీల నాయకులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడారు. ప్రస్తుతం నియోజకవర్గంలో 237 పోలింగ్ కేంద్రాలు ఉన్నాయని తెలిపారు. కొత్త ఓటర్లు నమోదు కావడం, ప్రతి పోలింగ్ కేంద్రానికి 1200 మంది ఓటర్ల కంటే ఎక్కువగా ఉండడం వల్ల అదనంగా మరో 35 పోలింగ్ కేంద్రాల ఏర్పాటుకు కలెక్టర్ ఆమోదం కోసం ప్రతిపాదనలు పంపినట్లు చెప్పారు. టిడిపి ఎంపిటిసి మేకల వెంకటేష్, వైసిపి నాయకులు లక్ష్మిరెడ్డి, బిజెపి మండల అధ్యక్షులు విష్ణువర్ధన్ రెడ్డి, సిపిఎం మండల కార్యదర్శి హెచ్.జయరాజు పాల్గొన్నారు.

చెత్తరహిత గ్రామమే లక్ష్యం

- ఎంపిడిఒ పుల్లయ్య, డిప్యూటీ ఎంపిడిఒ సందీప్

ప్రజాశక్తి - నందవరం

మండలంలోని ముగతి గ్రామాన్ని చెత్తరహితంగా నిలపడమే లక్ష్యంగా కృషి చేద్దామని ఎంపిడిఒ వై.పుల్లయ్య, డిప్యూటీ ఎంపిడిఒ సందీప్ తెలిపారు. మంగళవారం గ్రామంలోని వీధివీధిన తిరుగుతూ పొడిచెత్తను పచ్చరంగు డబ్బా, తడి చెత్తను నీలిరంగు డబ్బాలో వేసి సేకరించి గ్రామంలో ఉన్న గ్రీన్ అంబాసిడర్‌కు అందించాలని పంచాయతీ కార్యదర్శి రవి ఆధ్వర్యంలో ప్రజలకు అవగాహన కల్పించారు. గ్రీన్ అంబాసిడర్ ఇంటింటి చెత్త సేకరింపునకు వస్తున్నారా అని గ్రామస్తులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. ఇంటి వద్దకు వచ్చే గ్రీన్ అంబాసిడర్‌కు చెత్త అందించి గ్రామంలో ఉన్న చెత్త నుంచి సంపద తయారీ కేంద్రం వద్ద జరిగే వర్మీ కంపోస్టు తయారీకి సహకరించి భాగస్వామ్యం కావాలని తెలిపారు. గ్రామంలో ఉన్న చిన్న, చిన్న వ్యాపారులు దుకాణం ముందు రెండు డబ్బాలు పెట్టుకుని.. అందులో ప్లాస్టిక్ కవర్లు, వివిధ రకాల చెత్తను డబ్బాలో పెట్టుకోవాలని సూచించారు. మురుగు కాలువలో ప్లాస్టిక్ కవర్లు, వాటర్ బాటిల్, చెత్త వేయరాదని, కాలువలో చెత్తాచెదారం పేరుకుపోయి నీరు నిలిచిపోతుం దని తెలిపారు. మురుగుదొడ్లు లేని వారు కట్టించుకోవాలని సూచించారు. గ్రామంలో ఉన్న మినరల్ వాటర్ ట్యాంకును పరిశీలించారు. వీధివీధిన తాగునీటి సౌకర్యం కల్పించాలని టిడిపి సీనియర్ నాయకులు ఈరన్న గౌడ్ అధికారులకు సూచించారు. గ్రామ మాజీ అధ్యక్షులు భార్గవ్ యాదవ్, టిడిపి గ్రామ అధ్యక్షులు నరసింహులు, గొర్రెల సంఘం ప్రెసిడెంట్ కొండారెడ్డి, మాజీ సర్పంచి కొండారెడ్డి, దస్తగిరి, కడబూరి, సురేష్, ప్రసాద్, శివ, స్వామిదాసు, నాగరాజు, ఆనంద్, మత్తయ్య బజారి, ఇమ్మానుయేల్ పాల్గొన్నారు.


గ్రామస్తులతో మాట్లాడుతున్న ఎంపిడిఒ

తాగునీటి సమస్య పరిష్కారంలో అధికారుల నిర్లక్ష్యం

ప్రజాశక్తి - నందవరం


నీరు పారని కుళాయి

తాగునీటి సమస్యను పరిష్కరించడంలో అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని ప్రజలు విమర్శిస్తున్నారు. కోట వీధిలో పుష్కలంగా పారే ఒక కుళాయి అనుకోకుండా నీరు రాకుండా గత కొన్ని రోజులుగా నిలిచిపోయింది. నీరు రాకపోవడంతో సుమారు 18 కుటుంబాలు తాగునీరు లేక ఇబ్బందులకు గురవుతున్నాయి. ఆ కుటుంబాలకు తాగునీరు కావాలంటే వేరే కుళాయికి సుమారు 20 మెట్లు ఎక్కి దిగి తెచ్చుకోవాల్సిన పరిస్థితి ఉంది. ఫోన్ ద్వారా పంచాయతీ అధికారికి సమాచారాన్ని చేరవేయగా సమస్యను పరిష్కరిస్తామని తెలిపారు. వాటర్ మెన్‌కు చాలా సార్లు పరిస్థితిని వివరించారు. అందులో ఏదైనా చెత్తపడి ఉంటుంది.. వచ్చి చూస్తామని చెబుతున్నారు. కనీసం ఆ కుళాయి దగ్గరికి అధికారులు కానీ, వాటర్ మెన్ కానీ రాకపోవడం విడ్డూరంగా ఉంది. ప్రజల సమస్యలపై అధికారులు వ్యవహరిస్తున్న తీరు ప్రజలకు ఇబ్బంది కలిగిస్తోందని పలువురు వాపోతున్నారు.

యూరియా కొరత లేదు : ఎఒ

ప్రజాశక్తి - కోసిగి

మండలంలో యూరియా కొరత లేదని, రైతు సేవా కేంద్రాల ద్వారా మంగళవారం మండలంలోని రైతులకు 135 మెట్రిక్ టన్నుల యూరియా పంపిణీ చేసినట్లు ఎఒ వర ప్రసాద్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. మండలంలోని అగసనూరు, ఆర్లబండ, జంపాపురం, జుమ్మాలదిన్నె, దుద్ది, చిర్తనకల్లు, కోసిగి, పల్లెపాడు, కందుకూరు, సజ్జలగూడెం గ్రామాల్లోని రైతు సేవా కేంద్రాల ద్వారా యూరియాను అందుబాటులోకి తెచ్చినట్లు తెలిపారు. యూరియా అవసరానికి మించి వాడవద్దని సూచించారు. నత్రజని, భాస్వరం, పొటాష్ ఎరువుల సమతుల్యత పాటించినప్పుడే మంచి దిగుబడులు సాధించవచ్చని తెలిపారు.

పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత : కూటమి

ప్రజాశక్తి - నందవరం

పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత అని కూటమి నాయకులు తెలిపారు. మంగళవారం వారు గ్రామంలో మొక్కలు నాటారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. ప్రతి ఒక్కరూ ఇంటి దగ్గర మొక్కలు పెంచుకోవాలని సూచించారు. పెరుగుతున్న విపరీతమైన కాలుష్యం వల్ల మానవ మనుగడకు ముప్పు వాటిల్లే ప్రమాదం ఉందని తెలిపారు. మొక్కలను పెంచి వాతావరణ కాలుష్యాన్ని నివారించాలని చెప్పారు. టిడిపి నాయకులు పుష్పావతి, ఖాసీం వలీ, జనసేన నాయకులు ఎల్లప్ప, గ్రామ అధ్యక్షులు భీమన్న, టిడిపి నాయకులు తిమ్మరాజు, రహిమాన్ బాష, వీరేష్, సత్య రెడ్డి, రఫీక్ పాల్గొన్నారు.

పాఠశాల సమీపంలో మత్తు పదార్థాల విక్రయం నిషేధం : డీఎస్పీ

ప్రజాశక్తి - ఆదోని

పాఠశాల, కళాశాల పరిసరాల్లో మత్తు పదార్థాల విక్రయం నిషేధమని డీఎస్పీ హేమలత హెచ్చరించారు. మంగళవారం ఆదోనిలో సిఐలు రాజశేఖర్ రెడ్డి, రామలింగప్ప, శ్రీరామ్ ఆధ్వర్యంలో తనిఖీలు నిర్వహించారు. పాఠశాల, కళాశాల సమీపంలో ఉన్న దుకాణాల్లో విక్రయిస్తున్న సిగరెట్, గుట్కా, పాన్ మసాలా, ఇతర మత్తు పదార్థాలను సీజ్ చేశారు. ఈ సందర్భంగా డీఎస్పీ మాట్లాడారు. పట్టణంలో ఆపరేషన్ సేఫ్ క్యాంపస్ జోన్‌లో భాగంగా పలు దుకాణాలపై దాడులు నిర్వహించినట్లు తెలిపారు. పాఠశాల, కళాశాల సమీపంలో గుట్కాలు, సిగరెట్లు అమ్ముతున్న షాపుల్లో సరుకును సీజ్ చేసి జరిమానా విధించామన్నారు. కళాశాల, పాఠశాలకు 100 మీటర్ల వరకు ఎటువంటి మత్తు పదార్థాలు అమ్మినా, బహిరంగ ప్రదేశాల్లో సిగరెట్లు తాగినా చర్యలు తప్పవని హెచ్చరించారు. ఇప్పటివరకు పలు షాపుల్లో దాడులు నిర్వహించామని, బహిరంగ ప్రదేశాల్లో సిగరెట్లు తాగుతున్న పలువురిపై కేసు నమోదు చేశామని తెలిపారు.

శ్రావణ మాసోత్సవాలకు పకడ్బందీ ఏర్పాట్లు

- ఆదోని సబ్ కలెక్టర్ మౌర్య భరద్వాజ్

ప్రజాశక్తి - కౌతాళం

శ్రావణమాస ఉత్సవాల్లో భక్తులకు ఇబ్బందులు లేకుండా పకడ్బందీ ఏర్పాట్లు చేయాలని ఆదోని సబ్ కలెక్టర్ మౌర్య భరద్వాజ్, దేవాలయ డిప్యూటీ కమిషనర్ విజయరాజు తెలిపారు. మంగళవారం కౌతాళం మండలం ఉరుకుంద గ్రామంలో శ్రీలక్ష్మీ నరసింహ ఉరుకుంద ఈరన్న స్వామి దేవస్థానం ఆవరణలో శ్రావణమాస ఉత్సవాలపై అధికారులతో సమీక్ష నిర్వహించారు. ముందుగా ఆలయ ప్రాంతంలో నిర్మాణ పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా సబ్ కలెక్టర్ మాట్లాడారు. ఈనెల 25 నుంచి ఆగస్టు 23 వరకు జరిగే శ్రావణమాస ఉత్సవాలకు వచ్చే భక్తులకు తాగునీరు, విద్యుత్, శానిటేషన్, పార్కింగ్, బారికేడ్లు, బస్సు ఏర్పాట్లు పకడ్బందీగా చేపట్టాలని తెలిపారు. భక్తులకు మెడికల్ క్యాంపులు నిర్వహించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ఎంఆర్‌పి కంటే అధిక ధరలకు అమ్మకాలు చేసే వారిపై చర్యలు తీసుకోవాలని రెవెన్యూ అధికారులకు సూచించారు. పటిష్టమైన భద్రతతో పాటు బారికేడ్లు, సిసి కెమెరాలు ఏర్పాటు చేయాలని పోలీసు అధికారులను ఆదేశించారు. ఆలయ సమీపంలో గ్రీవెన్స్ సిస్టమ్ ఏర్పాటు చేసి, భక్తులు సమస్యలను అర్జీ రూపంలో నమోదు చేసుకునే విధంగా ఏర్పాట్లు చేయాలన్నారు. అంతకుముందు డిప్యూటీ కమిషనర్ విజయ రాజు మాట్లాడుతూ... భక్తుల నమ్మకాన్ని, సాంప్రదాయాలను గౌరవిస్తూ ఏర్పాట్లను చేస్తున్నట్లు తెలిపారు. దేవస్థానంలో జరిగే ప్రతి కార్యక్రమాన్ని ముఖ్యమంత్రి, దేవదాయ శాఖ స్థాయిలో వీక్షించే విధంగా 54 ఆడియో, వీడియో రికార్డింగ్ స్థాయిలో ఉన్న కెమెరాలు ఏర్పాటు చేసినట్లు చెప్పారు. భక్తులకు 168 సాధారణ రూములతో పాటు, 32 ఏసీ రూములను ఆధునీకరించి, డార్మెటరీ హాళ్లను ఏర్పాటు చేశామన్నారు. 45 మురుగుదొడ్లతో పాటు మహిళలకు ప్రత్యేకంగా 24 మురుగుదొడ్లు అందుబాటులో ఉండేలా చేశామని తెలిపారు. పుణ్యక్షేత్రంలో ప్రతి భక్తునికీ శుద్ధజలం అందేటట్లుగా ఆర్‌డబ్ల్యుఎస్ అధికారుల సమన్వయంతో ఏర్పాటు చేశామన్నారు. తలనీలాలె సమర్పించడానికి మూడు చోట్ల కల్యాణ కట్ట సిద్ధం చేశామన్నారు. భక్తులు 9 ప్రదక్షిణలు చేసే విధంగా క్యూలైన్లు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఉచిత దర్శనం, వివిధ రూపాల్లో భక్తులు దర్శనం చేసే విధంగా చర్యలు తీసుకున్నామన్నారు. భక్తులకు రెండుసార్లు భోజనం అందించడానికి మూడు కౌంటర్లను ఏర్పాటు చేశామన్నారు.

మద్యపానాన్ని అరికట్టండి

శ్రీలక్ష్మి నరసింహ ఉరుకుంద ఈరన్నస్వామి పుణ్యక్షేత్రం పరిసరాల్లో మద్యం అమ్మకాలను అరికట్టాలని గ్రామ ప్రముఖులు కొట్రేష్ గౌడ్ అధికారులను కోరారు. ఈ విషయంపై గతంలో అధికారుల దృష్టికి వచ్చినా ఎక్సైజ్ అధికారులు పట్టించుకోలేదన్నారు. అనంతరం శ్రావణమాస ఉత్సవాల గోడపత్రికను సబ్ కలెక్టర్ మౌర్య భరద్వాజ్ ఆధ్వర్యంలో అధికారులు ఆవిష్కరించారు. డీఎస్పీ ఉపేంద్ర బాబు, సిఐ అశోక్ కుమార్, సర్పంచి రాధా, తహశీల్దార్ రజనీకాంత్ రెడ్డి, ఎంపిడిఒ రాజేంద్రప్రసాద్ పాల్గొన్నారు.


మాట్లాడుతున్న సబ్ కలెక్టర్ మౌర్య భరద్వాజ్

ప్రజల గుండెచప్పుడు వైఎస్‌ఆర్

- వైసిపి ఇన్‌ఛార్జీ బుట్టా రేణుక
- వైఎస్‌ఆర్ జయంతి

ప్రజాశక్తి - ఎమ్మిగనూరు


ఎమ్మిగనూరులో దుప్పట్లు పంపిణీ చేస్తున్న బుట్టా రేణుక

ప్రజా సంక్షేమం పథకాలతో ప్రజల గుండెచప్పుడుగా నిలిచిన మహా నేత కీర్తిశేషులు వైఎస్.రాజశేఖర్ రెడ్డి అని వైసిపి ఇన్‌ఛార్జీ బుట్టా రేణుక, వైసిపి జిల్లా ఉపాధ్యక్షులు ఎర్రకోట జగన్మోహన్ రెడ్డి తెలిపారు. మంగళవారం వైఎస్‌ఆర్ జయంతి సందర్భంగా వైఎస్‌ఆర్ సర్కిల్‌లో బుట్టా రేణుక, జగన్మోహన్ రెడ్డి, వైసిపి సీనియర్ నాయకులు బుట్టా శివ నీలకంఠ, రాష్ట్ర యువజన విభాగం ఉపాధ్యక్షులు బుట్టా ప్రతుల్, పట్టణ అధ్యక్షులు నాగశేషప్ప, బీసీ సెల్ సంయుక్త కార్యదర్శి విరుపాక్షి రెడ్డి, అధికార ప్రతినిధి కదిరికోట సునీల్ కుమార్, పాల శ్రీనివాస్, యుకె.రాజశేఖర్, శివ ప్రసాద్, వైఎస్‌ఆర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం ప్రభుత్వాస్పత్రిలో రోగులకు పాలు, పండ్లు, బ్రెడ్లు పంపిణీ చేశారు. అలాగే వైఎస్‌ఆర్ సర్కిల్‌లో వికలాంగులు, మానసిక పాఠశాలలో, శివన్న నగర్, శ్రీసరస్వతి శిశు మందిర్ పాఠశాలలో దాదాపు 200 మంది పేద విద్యార్థులకు పుస్తకాలు పంపిణీ చేశారు. బీసీ హాస్టల్ పేద విద్యార్థులు 200 మందికి బెడ్ షీట్లు పంపిణీ చేశారు. **మంత్రాలయం**లోని రాఘవేంద్ర సర్కిల్‌లో వైఎస్‌ఆర్ కాంస్య విగ్రహానికి పూలమాలలు వేసి వైసిపి జిల్లా ఉపాధ్యక్షులు వై.ప్రదీప్ రెడ్డి నివాళులర్పించారు. అనంతరం కేక్ కట్ చేసి సర్పంచి, వైసిపి మండల ఉపాధ్యక్షులు తెల్లబండ్ల భీమయ్యకు తినిపించగా.. వైసిపి మండల అధ్యక్షులు జి.భీమారెడ్డి ప్రదీప్ రెడ్డికి తినిపించారు. ఇతర నాయకులు, కార్యకర్తలు ప్రదీప్ రెడ్డికి తినిపించి సంబరాలతో శుభాకాంక్షలు తెలుపుకున్నారు. వైసిపి మండల ఇన్‌ఛార్జీ విశ్వనాథ్ రెడ్డి, మండల ఉపాధ్యక్షులు పులికుక్క రాఘవేంద్ర, ఉప సర్పంచి హోటల్ పరమేష్ స్వామి, ఎంపిటిసి వెంకటేష్, వార్డు సభ్యులు వీరారెడ్డి, రామాంజనేయులు, నాయకులు లక్ష్మీ నారాయణ రెడ్డి, కాంతారెడ్డి, నారాయణ రెడ్డి, జనార్దన్ రెడ్డి, కురువ మల్లికార్జున, శివ, వికెసి రాఘవేంద్ర, వడ్డే నారాయణ, రాము, రవి రెడ్డి, వడ్డే చిన్న ఈరన్న, అబ్రహాం, గుడేకల్లు మారెప్ప, సాల్మన్ రాజు పాల్గొన్నారు. **కోసిగి**లోని వైఎస్‌ఆర్ సర్కిల్ వద్ద వైఎస్‌ఆర్ జయంతి వేడుకలను ఎమ్మెల్యే వై.బాలనాగిరెడ్డి, వైసిపి మండల ఇన్‌ఛార్జీ పి.మురళీ మోహన్ రెడ్డి ఆదేశాల మేరకు ఘనంగా నిర్వహించారు. ముందుగా వైఎస్‌ఆర్ విగ్రహానికి పాలాభిషేకం చేసి, పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఎంపిపి పెండేకల్లు ఈరన్న, మండల కన్వీనర్ బెటన్న గౌడ్, మండల నాయకులు నాడిగేని నాగరాజు, జగదీష్ స్వామి, మంగమ్మ, నరసింహులు, బసిరెడ్డి, రాముడు, కాంట్రాక్టర్ నాగరాజ్, అయ్యప్ప పాల్గొన్నారు. **కౌతాళం**లో వైఎస్‌ఆర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. వైసిపి మండల కన్వీనర్ దేశాయి ప్రహ్లాద చారి, మాజీ సర్పంచి అవతారం, సర్పంచి పాల్ దినకరన్, వైస్ ఎంపిపి బుజ్జి స్వామి, వెంకటరామరాజు, ఉప సర్పంచి సక్రి తిక్కయ్య, వడ్డే రామన్న, అబ్దుల్ సమద్, ఎస్ఎస్‌వి.షేక్షావలీ, భీమేష్, ఎంపిటిసి ముకన్న, వార్డు సభ్యులు డింగి రామకృష్ణ, నర్సిరెడ్డి, కె.నారాయణ, పూజారి తాత, ఎన్‌టిఆర్ నగర్ వీరేష్, చిన్న బాష, వడ్డే హుసేని, వడ్డే అంజి, వడ్డే గురు పాల్గొన్నారు. **చిప్పగిరి**లో డాక్టర్ వైఎస్.రాజశేఖర్ రెడ్డి జయంతి వేడుకలు నిర్వహించారు. వైఎస్‌ఆర్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. వైసిపి మండల కన్వీనర్ జూటూరు మారయ్య, ఎమ్మెల్యే విరుపాక్షి తమ్ముడు బుసినే శ్రీరాములు, మండల కో కన్వీనర్ సత్తిరెడ్డి, పంచాయతీరాజ్ వింగ్ రాష్ట్ర ఉపాధ్యక్షులు ఓబులేసు, ఉప సర్పంచి పెద్ద పెద్దయ్య, ఎంపిటిసిలు భీమలింగ, సుంకన్న, ధర్మేంద్ర, మాజీ ఎంపిటిసి మల్లికార్జున, నాగేంద్ర, దామోదర, షేకన్న, సేనాపతి, మోహన్, నెట్టేకల్లు, వీరేష్, నాగరాజు, హనుమంతు, సురేష్ పాల్గొన్నారు.

పండ్ల తోటల పెంపకానికి ప్రోత్సాహం

- సర్పంచి గోవిందరాజులు, ఎంపిటిసి రజిని, ఎంపిడిఒ అల్లా బకాష్

ప్రజాశక్తి - చిప్పగిరి


చిప్పగిరిలో మొక్కలు నాటుతున్న అధికారులు


దేవనకొండలో మొక్కలు పంపిణీ చేస్తున్న ఎంపిడిఒ


గోనెగండ్లలో

పండ్ల తోటల పెంపకాన్ని ప్రోత్సహిద్దామని, అందుకు ప్రభుత్వం కూడా కావాల్సిన ఆర్థిక వనరులు సమకూరుస్తోందని సర్పంచి దాసరి గోవిందరాజులు, ఎంపిటిసి రజిని, ఎంపిడిఒ అల్లాబకాష్ తెలిపారు. మంగళవారం ఏపీవో జుబేర్ అహ్మద్, పంచాయతీ కార్యదర్శి ప్రమీల ఆధ్వర్యంలో చిప్పగిరిలో ఆర్టికల్చర్ వన్డే క్యాంపు కార్యక్రమంలో భాగంగా మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఏపీవో మాట్లాడారు. ఈ కార్యక్రమం ద్వారా 16 మంది రైతులకు సంబంధించిన 40 ఎకరాల్లో 3,400 జామ, సపోటా, నేరేడు, నిమ్మ మొక్కలను నాటినట్లు తెలిపారు. జనసేన మండల నాయకులు చిరంజీవి, టిడిపి నాయకులు జనార్ధన స్వామి, డిప్యూటీ ఎంపిడిఒ బాలన్న, పంచాయతీ కార్యదర్శులు సురేంద్ర, నరేంద్ర, టెక్నికల్ అసిస్టెంట్ మారుతి, ఉపాధి ఫీల్డ్ అసిస్టెంట్ రఘు పాల్గొన్నారు. **దేవనకొండ** మండలం కొత్తపేట గ్రామంలో చాంద్ బాషా అనే రైతు పొలంలో పండ్ల మొక్కలు నాటి రైతులకు పంపిణీ చేశారు. ఎంపిడిఒ జ్యోతి, ఏపీవో రాజు నాయక్ మాట్లాడారు. మండలంలో 114 మంది రైతులకు 260 ఎకరాల్లో నాటుకోవడానికి అనుమతి వచ్చిందన్నారు. సర్పంచి షేకమ్మ, పంచాయతీ సెక్రటరీ సునీల్, ప్లాంటేషన్ సూపర్‌వైజర్ రత్నం, ఈసీ గంగన్న, టెక్నికల్, ఫీల్డ్ అసిస్టెంట్లు నారాయణ, రఫీ, రైతులు పాల్గొన్నారు. **గోనెగండ్ల** గ్రామ రైతు నబీ రసూల్ పొలంలో కొబ్బరి, దానిమ్మ పండ్ల మొక్కలు నాటారు. ఏపీడీ అలీ పీరన్, ఎంపిడిఒ మణి మంజరి మాట్లాడుతూ... మండలంలో ప్రభుత్వం పండ్ల మొక్కల పంపిణీ, మొక్కల సంరక్షణ ఖర్చులు, సబ్సిడీ అలాంటి అనేక ప్రయోజనాలను అందిస్తోందని తెలిపారు. ఏపీవో మహ్మద్ బాష, టిడిపి మండల కన్వీనర్ తిరుపతయ్య నాయుడు, టౌన్ ప్రెసిడెంట్ ఎం.రహమతుల్లా, ఎన్‌వి.రామాంజనేయులు, బేతాళ బడేసా, శ్రీధర్ నాయుడు, పూజారి చంద్రశేఖర్, అచ్చుగట్ల హుస్సేన్, బాబు నాయుడు పాల్గొన్నారు.

దేశవ్యాప్త సమ్మెను విజయవంతం చేయండి

- సిఐటియు జిల్లా కార్యదర్శి నాగేశ్వరరావు

ప్రజాశక్తి - గోనెగండ్ల


గోనెగండ్లలో వినతిపత్రం ఇస్తున్న నాయకులు

లేబర్ కోడ్‌లను రద్దు చేయాలని కోరుతూ బుధవారం జరిగే దేశవ్యాప్త సమ్మెను జయప్రదం చేయాలని సిఐటియు జిల్లా కార్యదర్శి జె.నాగేశ్వరరావు కోరారు. మంగళవారం గోనెగండ్లలో సిఐటియు నాయకులు నబీ రసూల్ అధ్యక్షతన ఆశా వర్కర్స్ యూనియన్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా నాగేశ్వరరావు, శాఖ కార్యదర్శి కరుణాకర్ మాట్లాడారు. కార్మికులకు కనీస వేతనం రూ.26 వేలు ఇవ్వాలని, ప్రభుత్వ సంస్థల ప్రయివేటీకరణ ఆపాలని కోరారు. అనంతరం స్థానిక ప్రభుత్వాస్పత్రి వైద్యులు డాక్టర్ రంగ రవళికి వినతిపత్రం అందజేశారు. ఆశావర్కర్స్ యూనియన్ నాయకులు సుశాంతి, మునెమ్మ, అనూష, రామలక్ష్మి, సుజాత, బేగం, దాసరి సుజాత, లక్ష్మి పాల్గొన్నారు. **కౌతాళం** వైద్యాధికారికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా రైతుసంఘం జిల్లా ఉపాధ్యక్షులు మల్లయ్య మాట్లాడారు. బుధవారం జరిగే సార్వత్రిక సమ్మెలో పార్టీలకతీతంగా పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. సిపిఎం నాయకులు వీరన్న, అంగన్వాడీ నాయకులు విజయలక్ష్మి, సుజాత, లక్ష్మి, తాయమ్మ పాల్గొన్నారు. **ఎమ్మిగనూరు**లో సిఐటియు ఆధ్వర్యంలో మున్సిపల్ కార్మికుల సమావేశం నిర్వహించారు. సిఐటియు మండల కార్యదర్శి బి.రాముడు మాట్లాడుతూ... బుధవారం దేశవ్యాప్త సమ్మెను జయప్రదం చేయాలని కోరారు. కార్మిక సంఘం నాయకులు కె.ఖాజా, ఆనంద్, గోరు బాష, వెంకట్రాముడు, సాల్మన్, రాజేంద్ర, వెంకటేశులు, నరసింహులు, రమణ పాల్గొన్నారు.


కౌతాళంలో వినతిపత్రం ఇస్తున్న నాయకులు


ఎమ్మిగనూరులో మాట్లాడుతున్న నాయకులు

వంద శాతం సబ్సిడీతో కంది విత్తనాలు పంపిణీ

ప్రజాశక్తి - దేవనకొండ

దేవనకొండ రైతు సేవా కేంద్రంలో మంగళవారం ఎల్ఆర్‌జి 52 అనే రకం కంది విత్తనాలను వందశాతం సబ్సిడీతో ఎఒ ఉషారాణి ఆధ్వర్యంలో రైతులకు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎఒ మాట్లాడారు. మండలానికి 39 క్వింటాళ్ల కంది విత్తనాలు వచ్చినట్లు తెలిపారు. గ్రామాల్లోని రైతు సేవా కేంద్రాల్లో అందుబాటులో ఉన్నాయన్నారు. రైతులు ఆధార్ కార్డు తీసుకుని రిజిస్ట్రేషన్ చేసుకొని తీసుకోవాలని తెలిపారు. ఎఇఒలు రంగన్న, అబ్దుల్ సలాం, మల్లికార్జున, వివిఎ కళావతి బాయి, రైతులు పాల్గొన్నారు.